క్లుప్తంగా

నేడు కేంద్ర మంత్రి రాక

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ రానున్నట్లు బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వెంకటేశం తెలిపారు. రూ.2.70 కోట్లతో పనులు పూర్తయిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు.

కొనసాగుతున్న శిక్షణ

ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు



కరాటే ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

సిద్దిపేటకమాన్: పట్టణంలోని భరత్‌నగర్‌లో సాక్షి, అంబిటస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం మూడో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. విద్యార్థులకు ఉదయం కరాటే, యోగా, డ్యాన్స్, హ్యాండ్ రైటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై టీచర్లు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు అంశాలను నేర్చుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కరాటే మాస్టర్ భాగ్యరాజ్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షాలపై అప్రమత్తం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జయదేవ్ ఆర్య

బెజ్జంకి(సిద్దిపేట): అకాల వర్షాలతో నష్టపోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య సూచించారు. వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాక్షికంగా తడిసిన ధాన్యం వల్ల రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. కొనుగోళ్లలో జాప్యం జరుగకుండా చూడాలని హమాలీలకు సూచించారు. మళ్లీ వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, సీసీలు సారయ్య, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ కల్యాణ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల పూనకాల మధ్య మహిళలు గ్రామంలో బోనాలను ఊరేగించి ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. పూజల్లో మాజీ సర్పంచ్ బాబు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్యతో తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

సిద్దిపేటకమాన్: తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడొద్దని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ నరసింహారెడ్డి చెప్పారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ధాన్యం కుప్పను ఎలాంటి కటింగ్ లేకుండా ప్రభుత్వమే తీసుకుటుందన్నారు. మార్కెట్ యార్డులో రైతులు దోపిడీకి గురవుతున్నారని, 40 కిలోల సంచికి రూ.8 హమాలీ తీసుకోవాల్సి ఉండగా రూ.10 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజిరెడ్డి, రాజు, నరేశ్, చందు, సురేందర్‌రెడ్డి, సందీప్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు బాధాకరం

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ ఉద్యోగుల ప్రయోజనాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాకం మల్లేశం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 317 జీఓ వల్ల ఎంతో మంది ఉపాధ్యాయ ఉద్యోగులు స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

‘తడిసి’మోపెడు!

టార్పాలిన్లు లేక ధాన్యం వర్షార్పణం

- సరఫరా కాని సబ్సిడీ కవర్లు
- ఆరేళ్లుగా ఇదే దుస్థితి
- అదనపు భారం మోస్తున్న రైతన్నలు



రామునిపట్లలో అద్దె కవర్లలో ఆరబోసిన ధాన్యం

ఆరుగాలం పండించిన పంటను రక్షించుకోవడానికి అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. సాగును కంటికి రెప్పలా కాపాడుకోవడం ఒక ఎత్తయితే.. అకాల వర్షాల నుంచి చేతికందిన పంటను సంరక్షించుకోవడం మరో ఎత్తు. అందుకు రైతులను ఆదుకునేవి టార్పాలిన్లు. వాటిని అందుబాటులో ఉంచాల్సిన కొనుగోలు కేంద్రాలు, సహకార సంఘాలు చేతులెత్తేశాయి. దీంతో అన్నదాతల కష్టం వర్షార్పణం అవుతోంది.

చిన్నకోడూరు(సిద్దిపేట): గతంలో అకాల వర్షాల నుంచి రైతులు పండించిన పంటలను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు అందించేది. అయితే ఆరేళ్లుగా ప్రభుత్వం టార్పాలిన్ కవర్లపై సబ్సిడీని నిలిపివేసింది. దీంతో వర్షాలు కురిసినప్పుడు చేతికి అందివచ్చిన పంటను నష్టపోవాల్సి వస్తుంది. వాటిని బహిరంగ మార్కెట్‌లో పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయడంతో తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని రైతులు వాపోతున్నారు.

వసతులు శూన్యం

నిబంధనల ప్రకారం సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచాల్సి ఉంది. అకాల వర్షాలు కురిసినప్పుడు కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తడవకుండా కప్పడానికి వాటిని అందించాల్సి ఉన్నా అది ఎక్కడా అమలుకావడం లేదు. ధాన్యం కొనుగోళ్లలో లక్షల్లో కమీషన్‌లు పొందుతున్న సహకార సంఘాలు చిరిగిపోయిన కవర్లు ఉంచి చేతులు దులుపుకుంటున్నాయి.

సబ్సిడీపై రూ.1,250కే..

గతంలో ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్ కవర్లను రూ.1,250కే అందజేసేది. తర్వాత ఈ పథకాన్ని వ్యవసాయశాఖకు బదిలీ చేసింది. కొన్నేళ్లు రైతులకు సబ్సిడీపై కవర్లు పంపిణీ చేసినా తర్వాత గాలికొదిలేశారు. ఆరేళ్లుగా కవర్ల పంపిణీ లేకుండా పోయింది. దీంతో రైతులు సొంత ఖర్చులతో ఒక్కో టార్పాలిన్‌కు రూ.3 వేలు వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఆర్థికంగా భారం కావడంతో రైతులు అద్దె టార్పాలిన్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

> **కవర్లు లేక ధాన్యం తడిసింది**
>
> టార్పాలిన్ కవర్లు లేక ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసింది. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కవర్ల పంపిణీ ప్రక్రియ ప్రాంభించాలి. కొన్నేళ్లుగా పంట నూర్పిడి సమయంలోనే అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. కవర్లు ఉంటే ధాన్యం తడవకుండా ఉండేది. అద్దె టార్పాలిన్ల భారం నుంచి విముక్తి కల్పించాలి.
>
> – జి.లక్ష్మణ్, రైతు రామునిపట్ల

కొనుగోళ్లు వేగవంతం చేయండి

- కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని గోవర్ధనగిరి, నందారం, రామవరం, అంతక్కపేట, జనగామ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పేదరిక నిర్మూలన సంస్థ(ఐకేపీ) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్ సందర్శించారు. ‘తాగునీరు లేదాయె.. చెట్లనీడే దిక్కాయె.. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు’ అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తొందరగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్పకుండా నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం జి.శ్రీనివాస్‌గౌడ్, సీసీలు రాజు, తిరుపతి, శివ చరణ్‌సింగ్, వీఓఏలు కవిత, సబిత, మంగాదేవి, అంజలి, అనిత, స్వరూప తదితరులు ఉన్నారు.



రామవరంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్

నేలరాలిన మామిడి.. నష్టపరిహారమివ్వండి

అక్కన్నపేట(హుస్నాబాద్): మూడురోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలోని కేశవాపూర్, గోవర్ధనగిరి, మల్లంపల్లి, కట్కూర్ గ్రామాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలపాలయ్యాయి. దెబ్బతిన్న మామిడి తోటలకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరారు. కాయలు చేతికందే సమయంలో పూర్తిగా నష్టపోయామని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ ముత్తినేని వేణుగోపాల్‌రావు, రైతులు కోరారు.

తోటల పరిశీలన

హుస్నాబాద్: అకాల వర్షం, ఈదురుగాలులకు మండల పరిధిలో 366 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్లు మండల ఉద్యానశాఖ అధికారి బాలాజీ తెలిపారు. హుస్నాబాద్‌లో గాలి దుమారానికి దెబ్బతిన్న మామిడి తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. పట్టణానికి చెందిన సంపత్ రాజిరెడ్డికి చెందిన 5 ఎకరాలు, అయిలేని శంకర్ రెడ్డికి చెందిన నాలుగెకరాల తోటల్లో రాలిన మామిడి కాయలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆయన చెప్పారు.



హుస్నాబాద్: మామిడి కాయలను చూపుతున్న కూలీలు

కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం

రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

గజ్వేల్‌రూరల్: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సీఐటీయూ కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు చెప్పారు. ప్రజ్ఞాపూర్ శివారులోగల రాణే పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారం(గేట్ మీటింగ్)లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల మెరుగైన జీవన ప్రమాణాల కోసం సీఐటీయూ యాజమాన్యాలతో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కార్మికుల కుటుంబాలకు మెరుగైన మెడికల్ పాలసీ, జీపీఏను అమలుచేసి కార్మికులకు నష్టం కలగకుండా పోరాడిందని, కార్మికులు మృతి చెందిన ఘటనల్లో వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండి పోరాడామని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే సంఘాలను ఓడించాలని, సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు వేణుగోపాల్, స్వామి, భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, మల్లయ్య, నర్సింహులు, రంగారెడ్డి, వెంకట్రావ్, శ్రీనివాస్, స్వామి, సాజిద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్కా రాములు

రాయపోల్ తహసీల్దార్‌గా కృష్ణ మోహన్



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణ మోహన్

దుబ్బాకటౌన్: రాయపోల్ తహసీల్దార్‌గా కృష్ణ మోహన్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. కలెక్టర్ కార్యాలయంలోని భూ సేకరణ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన కృష్ణ మోహన్ బదిలీపై వచ్చారు.

కౌలు ఆదాయం రూ.2.38లక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని తిగుల్ వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన ఆరు సర్వే నంబర్లలోని 26 ఎకరాలకు మంగళవారం ఆలయ ఈఓ రవి కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు రూ.2.38 లక్షలకు ఆ భూమిని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు ద్వారా వచ్చిన ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, మాజీ ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య పాల్గొన్నారు.

ముగిసిన చిన్మయ మిషన్ వేసవి శిబిరం



చిన్నారులతో కలిసి భగవద్గీత పఠిస్తున్న స్వామి యజ్ఞానంద

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక సుందర సత్సంగంలో ఐదు రోజులుగా స్వామి యజ్ఞానంద ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్మయ బాలల వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ‘కృష్ణ ద వండర్ బాయ్’ అంశంతో ఈ శిబిరం నిర్వహించారు. చిన్నారులకు నీతి కథలు, రామాయణ, మహాభారత, భగవద్గీత ప్రాధాన్యం, అలాగే భగవద్గీత పఠనం, హస్తకళలు, నృత్యం, చిత్రలేఖనం విభాగాలలో శిక్షణ ఇచ్చారు. ముగింపు సమావేశానికి హాజరయిన స్వామి యజ్ఞానంద మాట్లాడుతూ పిల్లలు ఆదర్శవంతంగా ఎదగడానికి ఆధ్యాత్మికత, నైతికత, మానవతా విలువలు ఎంతో అవసరం అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం బాలవిహార్ కార్యక్రమం నిర్వహిస్తారని, చిన్నారులంతా పాల్గొనాలని సూచించారు. భగవద్గీత పఠనం పోటీలలో సీనియర్స్ విభాగంలో కాచం అనన్య, జూనియర్స్ విభాగంలో కాచం ఆరుషి ప్రథమ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ నిర్వాహకులు ఉష, చైతన్య, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాగుపద్ధతులపై అవగాహన అవసరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న భాస్కర్‌రెడ్డి

ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులు సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. పోతారం(ఎస్)లో ఆయిల్ పామ్ సాగు పద్ధతులపై మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యావనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో బోరు బావుల్లో నీటి లభ్యత తక్కువగా ఉంటుందని, మొక్కలకు నీరు అందించకపోతే నష్టం జరుగుతుందన్నారు. పదెకరాలకు డ్రిప్పు ద్వారా అందించే నీటిని ఐదెకరాల చొప్పున రెండు విడతలుగా నీరందిస్తే మొక్కలు ఎండిపోకుండా ఉంటాయని చెప్పారు. కలుపు మొక్కలను తొలగించాలని, అవసరమైన ఎరువులను వేయాలని సూచించారు. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వలసదారులపై విచారణ కోరుతూ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): అక్రమ వలసదారులపై విచారణ జరపాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు, పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ ఎండీ సమీర్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తులు అక్రమంగా నివాసం ఉంటూ పౌరసత్వం లేకుండానే తప్పుడు పత్రాలతో ప్రభుత్వ సేవలు పొందుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్‌గౌడ్, సత్యవర్ధన్, బాలరాజ్, బాల్‌నర్సయ్య, శ్రీనివాసరావు, బాబు, లక్ష్మీపతి, సిద్ధిలింగం, కార్తీక్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అజిత్‌కుమార్, శ్రీనివాస్, గణేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హుస్నాబాద్: వర్షాలు, ఈదురు గాలులతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో నర్సారెడ్డి

గజ్వేల్: ప్రజ్ఞాపూర్‌లో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బోనాల ఊరేగింపులో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మండల పరిధిలో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, తహసీల్దార్ ఉదయశ్రీకి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించక పోవడం సిగ్గుచేటన్నారు. నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పోలీస్ రాజులు, బాల్‌రాజు, అంజిరెడ్డి, సత్యనారాయణ, మల్లేశం, ఎండీ అహ్మద్, లింగం, రాములు, రమేశ్, నర్సింహారెడ్డి, కుమార్, దుర్గారెడ్డి, నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఉదయశ్రీకి వినతి పత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కూలిన చెట్టును తొలగించిన ప్రయాణికులు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఈదురుగాలులకు రోడ్డుపై కూలిన చెట్టును ఆర్టీసీ డ్రైవర్ చంద్రమౌళి, ప్రయాణికులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. సోమవారం రాత్రి ఈదురు గాలుల ప్రభావానికి మండలంలోని రాంచంద్రపూర్ నుంచి వింజపల్లి వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డంగా ఒక చెట్టు కూలింది. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు గ్రామాల పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు.



చెట్టును తొలగిస్తున్న ప్రయాణికులు, డ్రైవర్

సంక్షిప్త వార్తలు

◆ సిబిల్ తప్పనిసరి చేయడం సరికాదు

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకంలో సిబిల్ తప్పనిసరి చేయడం సరికాదని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మండిపడ్డారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మంగళవారం మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ పథకం ప్రైవేటు బ్యాంకుల లాగా సిబిల్‌ను తప్పనిసరి చేయడం ఏమిటని ప్రశ్నించారు. బాబు, మహేశ్, లింగం, నాగరాజు పాల్గొన్నారు.

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గజ్వేల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకుసాగుతున్నారని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లో పలువురు లబ్ధిదారలకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పేదల కోసం సాహససోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తులకు ఆహ్వానం

నంగునూరు(సిద్దిపేట): అక్కేనపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మంద జానయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, బాలికలకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని చెప్పారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 26 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి మంగళవారం వారికి రూ.45,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ రెవెన్యూ సదస్సు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనంతరెడ్డి సూచించారు. మండలంలోని చౌడుతండా, గుబ్బడి, గోవనర్ధనగిరి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు అందజేశారు. అనంతరం అనంతరెడ్డి మాట్లాడుతూ 20వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కోహెడ మండల తహసీల్దార్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట)/హుస్నాబాద్: బీజేపీ మండల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రకటించారు. సిద్దిపేట టౌన్-1కు సంతోష్‌కుమార్, టౌన్-2కు వెంకట్, అర్బన్‌కు వరప్రసాద్, రూరల్‌కు సురేశ్‌గౌడ్, నారాయణరావుపేటకు శ్రీనివాస్, దుబ్బాక రూరల్‌కు అనిల్‌రెడ్డి, తొగుటకు సీహెచ్ చంద్రం, జగదేవ్‌పూర్‌కు అయిలయ్య, ములుగుకు లక్ష్మణ్‌గౌడ్, హుస్నాబాద్ మున్సిపాలిటీకి శంకర్, వర్గల్‌కు తిరుపతి రెడ్డిని అధ్యక్షులుగా నియమించారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, ఉమారాణి, శ్రీనివాస్, కృష్ణ, సంతోష్, దాబానరేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చేర్యాల పట్టణ అధ్యక్షుడిగా 4వ వార్డు శ్రీనగర్ కాలనీకి చెందిన కర్క తిరుపతిరెడ్డిని, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడిగా బత్తుల శంకర్ బాబును ఎంపిక చేశారు.

◆ ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా రాజేందర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో స్థానిక మెరీడియన్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డిని సర్టిఫైడ్ ట్రైనర్‌గా ఎంపిక చేసినట్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

◆ ముగిసిన పాలిటెక్నిక్ శిక్షణ

హుస్నాబాద్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం ఆల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాకేశ్, జిల్లా కన్వీనర్ ఆదిత్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. చరణ్, రాకేశ్, రాజు, అంజి తదితరులు ఉన్నారు.

◆ పాస్టర్‌కు ఆర్థిక సాయం

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన సియోను పార్థన మందిరం నిర్వాహకుడు పాస్టర్ మత్తయికి మాజీ ఎంపీటీసీ బొయిని జయరాజు రూ.5వేలు సాయం అందించారు. సోమవారం సాయంత్రం గాలివానకు చర్చి పైకప్పు ధ్వంసమవ్వడంతో ఆయన సాయం అందించారు.